క్లుప్తంగా

'ఎప్‌సెట్'ల్లో ఏబీవీ విద్యార్థుల ప్రతిభ


చెన్నోజు దేవిశ్రీ

జనగామ: రాష్ట్రంలో శనివారం విడుదలైన ఎప్‌సెట్ ఫలితాల్లో జిల్లా కేంద్రం నెహ్రూ పార్కు ఏరియాలోని ఏబీవీ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. పట్టణానికి చెందిన చెన్నోజు దేవిశ్రీ 2,440 ర్యాంకు సాధించగా, మరో నలుగురు విద్యార్థులు 10వేల ర్యాంకుతో సత్తా చాటుకున్నారు. వారిని కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

మాదిగ ప్రొఫెసర్లను వీసీలుగా నియమించాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ మాదిగ



బచ్చన్నపేట : రాష్ట్రంలోని పది యూనివర్సిటీలకు వీసీల నియామకానికి ప్రభుత్వం సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేసిందని, రెండు వర్సిటీలకు మాదిగ ప్రొఫెసర్లను వీసీలుగా నియమించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ మాదిగ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పైస రాజశేఖర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌సీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రజలను చైతన్య పర్చడానికి ఆటలు, పాటలు పాడి.. జైలుకు వెళ్లి.. ప్రాణత్యాగాలు చేసి.. వ్యూహకర్తలుగా, ప్రధాన ఉపన్యాసకులుగా ఉద్యమాన్ని సజీవంగా నడిపించింది ఈ ప్రొఫెసర్లే అని అన్నారు. రిజిస్ట్రార్లు, ప్రవేశ పరీక్షల కన్వీనర్లు, వర్సిటీ పాలక మండళ్లు, ఇతర విద్యారంగ పదవుల నియామకాల్లో మాదిగలకు తగిన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎంఎస్‌సీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిషోర్, అధికార ప్రతినిధి సందన రవీందర్, అల్వాల అనిల్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ



జఫర్‌గఢ్: ఎమ్మెల్యే కడియం శ్రీహరి సతీమణి కడియం వినయరాణి పుట్టిన రోజు వేడుకలను మాజీ సర్పంచ్ గాదెపాక అనిత సుధాకర్ బాబు ఆధ్వర్యంలో రేగడితండా శివారు టీబీతండా వద్ద ఉన్న మా ఇల్లు అనాథాశ్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్ల పంపిణీతో పాటు పండ్ల పంపిణీ చేశారు. సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు, కాంగ్రెస్ జిల్లా నాయకులు అన్నెబోయిన బిక్షపతి, ఎంపీటీసీ ఫోరం మండల అధ్యక్షుడు ఎడ్ల వెంకటస్వామి, మాజీ సర్పంచ్ భూక్య పార్వతి రవి, ఎంపీటీసీలు జ్యోతి రజిత యాకయ్య పాల్గొన్నారు.

హనుమాన్ భక్తుల పూజలు

చిల్పూరు: మండలంలోని వంగాలపల్లి గ్రామానికి చెందిన హనుమాన్ భక్తులు శనివారం శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాదుగాయ రమేష్, రిషిబాబు, సోమ శ్రీనివాస్, వంశీరాజ్, గైరాజు, బబ్జిత్, రాఘవేంద్ర, మనోజ్‌కుమార్, అభిలాష్, సతీష్, నరేష్ పాల్గొన్నారు.

మురళి మృతి తీరనిలోటు

కొడకండ్ల: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ప్రముఖ ఫొటోగ్రాఫర్ మురళి మృతి పార్టీకి అతని కుటుంబానికి తీరని లోటని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని మార్కండేయ భవనంలో నిర్వహించిన మురళి సంతాప సభలో మండల నాయకులు, ఫొటోగ్రాఫర్లు పాల్గొని నివాళులర్పించారు. సోమనర్సయ్య, అబ్దుల్లా, రవీందర్, మనోహర్, మధుసూదన్, నాగరాజు, రమేష్, సైదులు, ఉప్పలయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం



స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన గోనెల రమేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. కాగా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి తనవంతుగా అందించిన రూ.25వేల సాయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు శనివారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చింతకుంట్ల నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు గన్ను నర్సింహులు, మునిగెల రాజు, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు నీల గట్టయ్య, శివునిపల్లి ఎంపీటీసీ బూర్ల లతాశంకర్, నాయకులు మునిగెల రాజు, నీల శ్రీధర్, గోనెల వెంకన్న, నీల వెంకటేశ్వర్లు, యాదగిరి, అనీల్, ఎల్లయ్య, కుమారస్వామి, వీరస్వామి, సాంబరాజు పాల్గొన్నారు.

వాసవీమాత జయంతి వేడుకలు


జనగామ: కలశపూజ చేస్తున్న భక్తులు


జనగామ: హోమం నిర్వహిస్తున్న అర్చకులు

జనగామ: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ ఏరియా నగేశ్వర, వాసవీకన్యకా పరమేశ్వరి, సీతారామచంద్ర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం, అమ్మవారి జయంతిని పురస్కరించుకుని శనివారం రెండవ రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారికి అష్టోత్తర శతకలశాలతో పంచామృతం, విశేష సుగంధ ద్రవ్యాలతో దేవతా మూర్తులకు అభిషేకం నిర్వహించారు. విశేష అలంకరణ తర్వాత సువర్ణ పుష్పార్చన, కుంకుమార్చనలు, పారాయణం, హోమం, తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ వేడుకల్లో వాసవి కన్యకా పరమేశ్వరి సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్‌లో..


జఫర్‌గఢ్: వేడుకల్లో ఆర్యవైశ్యులు

జఫర్‌గఢ్: ఆర్యవైశ్యుల ఇలవేల్పు అయిన వాసవీమాత జయంతి ఉత్సవాలను కనులపండువగా నిర్వహించారు. మండల కేంద్రంలో శనివారం ఆర్యవైశ్య భవనంలో ఆర్యవైశ్యులు అమ్మవారి చిత్రపటానికి పూలమాలలతో అలంకరించి పూజ నిర్వహించారు. పెనుగొండలోని కుసుమశ్రేష్ఠి కుసుమాంబ పుణ్యదంపతులకు జన్మించిన వాసవీమాత ఆర్య వైశ్యుల ఆత్మాభిమానాన్ని, త్యాగనిరతిని ప్రపంచానికి చాటి చెప్పిందని ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు చిట్టిమళ్ల కృష్ణమూర్తి, రేవూరి శ్రీనివాస్, బోనగిరి శ్రవణ్‌కుమార్, బెలిదె పూర్ణచందర్, గందె సోమన్న, పాలకుర్తి రాజన్న, బజ్జూరి చలమయ్య, దొడ్డ రాజ్‌కుమార్, ఆశోక్, సురేష్, శ్రీధర్, శ్రీను, సతీష్, రవి, హరిశంకర్ పాల్గొన్నారు.

పాలకుర్తిలో..


పాలకుర్తి: కుంకుమార్చన చేస్తున్న మహిళలు

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని గుడివాడ చౌరస్తాలోని పంచగుళ్ల ప్రాంగణంలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు నిర్వహించారు. వేద పండితులు గంగు రఘు శర్మ మంత్రోచ్ఛరణల మధ్య మేళమహిళలు అమ్మ వారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చన చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ, బోరు ధ్వంసం


ధ్వంసం చేసిన సీసీరోడ్డు, డ్రెయినేజీ


ధ్వంసం వేసిన బోరు

జనగామ: పట్టణంలోని 9వ వార్డులోని సీసీ రోడ్డుతో పాటు డ్రెయినేజీ, బోరును శనివారం ధ్వంసం చేశారు. ఈ విషయమై వార్డుకు చెందిన బీజేపీ నాయకుడు శివరాజ్‌యాదవ్ గతంలోనే కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో పనులు ఆపేసి.. తిరిగి డోజర్‌తో కూల్చివేసి, ఆక్రమించే ప్రయత్నం చేస్తుండగా మరోసారి ఫిర్యాదు చేయడంతో కమిషనర్ వచ్చి పరిశీలించారు. బోరు కూల్చివేతపై పలువురు కాలనీవాసులు సైతం వచ్చి ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రెయినేజీ నీరు రోడ్డు పైకి వచ్చి దుర్వాసన వెదజల్లుతోందన్నారు. ఈ విషయమై కమిషనర్ చర్యలు తీసుకోవాలని కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



చిల్పూరు: మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామంలోని 3వ వార్డులో శనివారం సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. గత 3 నెలల క్రితం పనులు మొదలు పెట్టగా ఆ వార్డులోని కొందరు డ్రెయినేజీ ఉండొద్దని మరికొందరు ఉండాలని అనడంతో పనులు చేపట్టిన కాంట్రాక్టరు అక్కడ పనులు వదిలేసి మిగతాచోట్ల చేశాడు. దీంతో రోడ్డు గుంతలమయంగా మారడంతో వార్డు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అందరూ కలిసి వార్డులో కాల్వ ఉంచి సీసీరోడ్డు నిర్మించాలని కోరగా శనివారం పనులు చేపట్టారు.

'ప్రశ్నించే గొంతుకకు మద్దతు పలకండి'


దేవరుప్పుల: ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నతో విజయ్‌కుమార్ బృందం

దేవరుప్పుల: చట్టసభల్లో ప్రజాసమస్యలపై ప్రశ్నించే గొంతుకగా తీన్మార్ మల్లన్నకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు పలుకాలని తెలంగాణ మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈరెంటి విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లో వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మద్దతుగా ఆయనతోపాటు పలువురు కలిశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలపై క్షుణ్ణంగా తెలిసిన మల్లన్న లాంటి వ్యక్తుల్ని పట్టభద్రులు పొరపాటున విస్మరిస్తే ఉన్నత విద్యావంతులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. రాజకీయాలకతీతంగా పట్టభద్రులు సంపూర్ణ మద్దతు పలికి సమస్యల సాధనకు పూలబాటలు వేసుకోవాలని కోరారు. ఓయు రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక సురేష్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గండి శ్రీనివాస్, వెంకటిగళ్ల వెంకట్, పులి రాజ్‌కుమార్ ఉన్నారు.

'తీన్మార్ మల్లన్నను ఎమ్మెల్సీగా గెలిపించాలి'

బచ్చన్నపేట: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని మండలంలోని నక్కవానిగూడెం గ్రామ మాజీ సర్పంచ్ కంద్రాజు కొండయ్య కోరారు. శనివారం ఆయన మాట్లాడారు. గ్రామ శాఖ అధ్యక్షుడు బోడపట్ల ఐలయ్య, అమృతరెడ్డి, బొట్టు కిష్టయ్య, కర్ణాకర్, కుమార్, సుధాకర్, బాలయ్య పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సత్కారం


విద్యార్థులను సత్కరిస్తున్న అన్వర్

జనగామ: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన ముస్లిం విద్యార్థులను జమాతే ఇస్లామీ హింద్ జిల్లా శాఖ వారి ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో ఘనంగా సత్కరించి, మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ ఎండీ అన్వర్ ఖాన్ మాట్లాడుతూ ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. పిల్లలు ఇస్లామియా పద్ధతిలో నైతికత, నైపుణ్యాలు నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ ముజీబుర్ రహ్మాన్, అంకుషావలి, ఎండీ అప్సర్, ఎండీ జాకీర్, ఎండీ తాహసీన్, ఎండీ మొహసిన్, జమాతే ఇస్లామి హింద్ జిల్లా శాఖ అధ్యక్షుడు ఖలీద్ సయీద్ తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా .. ఐదుగురికి గాయాలు


బోల్తా పడిన కారు

స్టేషన్‌ఘన్‌పూర్: హైదరాబాద్ నుంచి హన్మకొండ వైపు జాతీయ రహదారిపై వెళ్తున్న కారు అదుపు తప్పి బోల్తా పడగా కారులో ఉన్న సయ్యద్ అబుదలీ, హుస్సేన్‌తో పాటు మరో ముగ్గురు గాయపడ్డ సంఘటన మండలంలోని రాఘవాపూర్ శివారులో శనివారం సాయంత్రం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండకు చెందిన సయ్యద్ అబుదలీ తన కుటుంబ సభ్యులతో కలిసి వ్యక్తిగత పనులపై హైదరాబాద్ నుంచి హనుమకొండకు కారులో వస్తున్నారు. ఈ క్రమంలో రాఘవాపూర్ శివారులో రైస్ మిల్లు వద్ద ఒక్కసారిగా కారు అదుపుతప్పగా రెండు పల్టీలు కొట్టి రహదారి పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఐదుగురు గాయపడగా స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో తరలించారు. కాగా స్థానిక ఎస్సై నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.

పండ్లు అమ్ముకునే మహిళకు తప్పిన ప్రమాదం..

రాఘవాపూర్‌లో జాతీయ రహదారి పక్కన మామిడి పండ్లు అమ్ముకునే ఛాగల్లుకు చెందిన బూర్ల సునీతకు తృటిలో ప్రమాదం తప్పింది. రోజూ మాదిరిగానే రోడ్డు పక్కన కూరగాయలు అమ్ముతూ పరధ్యాన్నంగా ఉన్న మహిళ ఒక్కసారిగా శబ్దం కావడంతో కూర్చున్న చోటు నుంచి లేచి పక్కకు జరిగింది. అదేసమయంలో పక్క నుంచే కారు దూసుకెళ్తూ బోల్తాపడటంతో ఆమె తీవ్ర భయాందోళనకు గురైంది. తృటిలో ప్రాణాపాయం తప్పిందని, లేకుంటే ఆమెపై నుంచే కారు వెళ్లేదని స్థానికులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధి కూలీలకు..

బచ్చన్నపేట: రోడ్డు ప్రమాదంలో ఉపాధి కూలీలకు గాయాలైన ఘటన మండలంలోని చిన్నరామన్‌చర్ల గ్రామం జనగామ–బచ్చన్నపేట హైవేపై మొండికుంట సమీపంలో శనివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నరామన్‌చర్ల గ్రామానికి చెందిన గుండ శారద, కర్రె సిద్దులు కర్రె పద్మలు ఉపాధి హామీ పనులు ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో మొండికుంట వద్ద రోడ్ క్రాస్ చేస్తుండగా గోపాల్‌నగర్ గ్రామానికి చెందిన వ్యక్తి తమ్మడపల్లి నుంచి బచ్చన్నపేట వైపు ద్విచక్రవాహనంపై వస్తూ వారి వాహనాన్ని ఢీ కొట్టడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను జనగామ ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అలాగే బైక్‌పై వచ్చి ఢీ కొట్టిన వ్యక్తి తలకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధి కూలీలను ఎంపీడీఓ రఘురామకృష్ణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి బుర్ర భానుచందర్‌లు పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఎంపీడీఓ కోరారు.

ఎమ్మెల్సీ ఉపఎన్నిక ఏర్పాట్లు పూర్తి చేయాలి


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ కొమురయ్య

లింగాలఘణపురం: ఎమ్మెల్సీ ఉపఎన్నిక ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ వినయలతకు జనగామ ఆర్డీఓ కొమురయ్య సూచించారు. ఈ నెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. మండలంలో 1,77 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా ఇటీవల లోక్‌సభ ఎన్నికలు జరిగిన ఉన్నత పాఠశాలలోనే రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయన వెంట ఆర్ఐ కిశోర్, ఆశ వర్కర్లతోపాటు తదితరులు ఉన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం


రఘునాథపల్లి: కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు


కొడకండ్ల: పూజలు నిర్వహిస్తున్న విశ్వకర్మలు

రఘునాథపల్లి: మండలంలోని కోమల్లలో శనివారం శ్రీ మద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామివారి ఆరాధన, కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. పెంట కృష్ణమూర్తి, వలబోజు వెంకటేశ్వర్లు, చిట్లోజు సురేష్, సంబోజు శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో పోచమ్మ గుడి వద్ద వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు చేశారు. అనంతరం వేదపండితులు మీదికొండ బ్రహ్మం వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల ఉత్సవ మూర్తులకు కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వలబోజు వెంకటేశ్వర్లు తన కుటుంబ సభ్యులతో కలిసి భక్తులకు అన్నదానం చేశారు.

కొడకండ్ల: వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన కార్యక్రమాన్ని శనివారం మండలకేంద్రంలో విశ్వకర్మ కులస్తులు ఘనంగా నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గణపతి పూజతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలను సంఘ గౌరవ సలహాదారు శ్రీపాద ఆంజనేయచారి ఆధ్వర్యంలో నిర్వహించగా కులస్తులంతా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయం నుంచి బొడ్రాయి వరకు ఊరేగింపు నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జ్ఞానేశ్వరచారి, రామాచారి, సోమయ్యచారి, ఆగాచారి, బ్రహ్మం, ఉపేంద్రాచారి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థికి పట్టం కట్టండి


ప్రచారం చేస్తున్న భాస్కర్‌రెడ్డి

కొడకండ్ల: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో పట్టం కట్టాల ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ పాలకుర్తి నియోజకవర్గ ప్రభారి కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి కోరారు. శనివారం మండల కోఆర్డినేటర్ మోడపల్లి సోమన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత 30 ఏళ్లుగా నమ్మిన సిద్ధాంతం కోసం నిస్వార్థంగా కృషి చేస్తున్న ప్రేమేందర్‌రెడ్డిని గెలిపిస్తే మండలిలో నిరుద్యోగుల, విద్యార్థుల, విద్యారంగ సమస్యలపై కొట్లాడే అవకాశం ఉంటుందన్నారు. గ్రాడ్యుయేట్ ఓటర్లలంతా విజ్ఞతతో ఆలోచించి ప్రశ్నించే గొంతుకు గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కోటేశ్వర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, సాయిదుర్గ, అంజనేయులు, ఉమేష్, మహేష్, కమలాకర్, రామకృష్ణ, వల్లపు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో అభివృద్ధి పనుల పరిశీలన


పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న మూర్తి

బచ్చన్నపేట: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం అన్ని రకాల వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు గానూ జరుగుతున్న మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని మండల నోడల్ అధికారి డీవీఎల్ఎన్ మూర్తి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పలు అభివృద్ధి పనులను శనివారం ఎంపీడీఓ రఘురామకృష్ణతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనులు నాణ్యతతో చేయాలని అప్పుడే వంద శాతం బిల్లులు అందుతాయన్నారు. సంప్ నిర్మాణం, పలు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన సూచించారు. పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు స్కూళ్ల ప్రతిష్ట పెంచారు


చిల్పూరు పాఠశాలకు ఎమ్మెల్సీ చేతుల మీదుగా నగదు అందజేస్తున్న పెద్ది వెంకటనారాయణగౌడ్


పురస్కారం పొందిన వెల్దండ పాఠశాల ఉత్తమ ఉపాధ్యాయురాలు విజయ

జనగామ: విద్యార్థులు ఉత్తమ జీపీఏలతో ప్రభుత్వ పాఠశాలల కీర్తి ప్రతిష్టలను మరింత పెంచారని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోతంరెడ్డి అన్నారు. 2023–24 విద్యాసంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ జీపీఏ సాధించిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు శనివారం జిల్లా కేంద్రంలో పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యాన ప్రతిభా పురస్కారాలు అందించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్ల మహిపాల్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన అడ్డంకులు త్వరలో తొలగిపోనున్నాయన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చిల్పూరు పాఠశాల స్కూల్ బ్యాంకుకు ప్రముఖ సామాజిక వేత్త పెద్ది వెంకటనారాయణగౌడ్ రూ.2వేలు అందించారు. బీరెల్లి కమలాకర్‌రావు, ఎంఈఓ శ్రీ భగవాన్, డాక్టర్ కల్నల్ మాచర్ల బిక్షపతి, నూకల ఎల్లారెడ్డి, పసునూరి సోమరాజు, వెంకటరెడ్డి, పి.యాదగిరి, రాజా సురేందర్‌రెడ్డి, పుల్లారెడ్డి, మిరియాల రమేష్, శ్రీనివాస్, అంజిరెడ్డి, రామచంద్రం పాల్గొన్నారు.

ఫలితాలకు పట్టాభిషేకం

నర్మెట: ఇటీవల విడుదలైన పదోతరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని పలు ఉన్నత పాఠశాలల విద్యార్థులు నూరు శాతం ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను, విద్యార్థులను పీఆర్టీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శనివారం సన్మానించి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా మండల కేంద్ర పాఠశాలతో పాటు వెల్దండ, హన్మంతాపూర్, అమ్మాపూర్, గిరిజన ఆశ్రమ బాలికల ఆశ్రమ పాఠశాల, కస్తూర్బా బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురస్కారాలను అందుకున్నారు.

ఆకట్టుకున్న భరత నాట్య ప్రదర్శన



పాలకుర్తి టౌన్: చిన్నారుల భరత నాట్య ప్రదర్శన అందరిని అలరించింది. శనివారం మండల కేంద్రంలోని సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఆవరణంలో ఆర్యన్‌శాస్త్ర భరత నాట్య శిక్షణ నిర్వాహకురాలు ఆర్యన్ సౌమ్య ఆధ్వర్యంలో భరతనాట్యంలో శిక్షణ పొందుతున్న చిన్నారులకు 'గజ్జల పూజ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల ప్రదర్శించిన భరత నాట్యం ఆకట్టుకుంది. ఈ చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బంగారు గొలుసు చోరీ

పాలకుర్తి : మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన మాచర్ల గౌరమ్మ మెడలోని మూడు తులాల బంగారం గొలుసును శనివారం గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడు. తమ ఇంటికి బాత్‌రూంకు సంబంధించిన మరమ్మతు పనుల విషయమై వచ్చాడని వారు తెలిపారు. తన మెడపై ఉన్న మూడు తులాల బంగారం చైన్ లాక్కెళ్లాడని గౌరమ్మ పోలీసులకు చెప్పింది. స్టేషన్‌ఘనపూర్ రోడ్డు వైపు వెళ్లాడని చెప్పింది. ఈ సంఘటనపై సీఐ మహేందర్ రెడ్డి, ఎస్సై ప్రసన్న కుమార్ విచారణ చేస్తున్నారు.

ఎమ్మెల్సీగా రాకేశ్‌రెడ్డిని గెలిపించండి



బచ్చన్నపేట: పట్టభద్రుల సమస్యలు ఉపాధి, ఉద్యోగ విషయాల్లో ప్రభుత్వంపై కొట్లాడే ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీఆర్ఎస్ మండల సమన్వయ కర్త ఎండీ ఫిరోజ్ అన్నారు. మండల కేంద్రంలో విలేకరులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాసనమండలిలో సమస్యలపై ప్రశ్నించే గొంతకను ఎమ్మెల్సీగా ఎన్నుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ డైరెక్టర్ కానుగంటి బాలచందర్, గ్రామ శాఖ అధ్యక్షుడు కంసాని మహేందర్‌రెడ్డి, నాయకులు మామిడి ఐలయ్య, తుప్పతి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.